కుల సంఘాలే టార్గెట్

- చేరికలపై దృష్టిపెట్టిన నాయకులు
- సిర్పూరు, ఆసిఫాబాద్‌లో జోరుగా మంతనాలు
- బీఆర్‌ఎస్‌ను అన్నీ తానై నడిపిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- కాంగ్రెస్‌కు మెజార్టీ తెచ్చేందుకు కృషిచేస్తున్న కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్
- పీఎం మోదీ చరిష్మాతో ముందడుగు వేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 26: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీలు కుల సంఘాల ఓట్లపై దృష్టిసారిస్తున్నాయి. ఈ క్రమంలో కుల సంఘాలే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంటు సెగ్మెంటు పరిధిలో ఎస్టీ ఓటర్ల తర్వాత అత్యంత కీలక మారింది బీసీ ఓటు బ్యాంకు. దీంతో ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని వారిని ఆకట్టుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూరు, ఆసిఫాబాద్ నియోకవర్గాల్లో బీసీ ఓటుబ్యాంకు గణనీయంగా ఉన్న సామాజికవర్గాలను



లక్ష్యంగా చేసుకొని అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ఇక బీఆర్‌ఎస్‌పార్టీ గతంలో తాము చేసిన కుల సంఘాలకు కేటాయించిన నిధులు, అభివృద్ధిపనులపై బీఆర్‌ఎస్ నాయకులు కులసంఘాల నాయకులతో మంతనాలు జరుపుతున్నారు.

జిల్లాలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన కోనేరు కోనప్ప ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవటంతో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలినట్లయింది. ఈ క్రమంలో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ రెండు పార్టీలు బీఆర్‌ఎస్‌ను టార్గెట్‌గా చేసుకొని ఆ పార్టీ క్యాడర్‌ను తమ వైపు ఆకట్టుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

మరోవైపు ఉన్న క్యాడర్‌ను చేజా రి పోనీయకుండా కాపాడుకునేందుకు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీ నుంచి బరిలోకి దిగిన మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు ఈ జిల్లా వారే కావటంతో ఈ రెండు నియోజకవర్గాల్లో మెజా ర్టీ సాధించాలన్న లక్ష్యంతో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే రేయింబవళ్లు తేడా లేకుండా కుల సంఘాల నాయకులను కలుస్తున్నారు. కొత్తగా కాంగ్రెస్‌లోకి చేరిన కోనప్ప సిర్పూరు నియోజకవర్గంలో అధిక మెజార్టీ సాధించి తన సత్తాచాటాలని భావిస్తున్నారు. అలాగే సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ కూడా కాంగ్రెస్ బలోపేతానికి తమ వంతుగా కృషిచేస్తున్నారు.

మరోవైపు నరేంద్ర మోదీ చరిష్మాతో బీజేపీ పట్ల ఉన్న క్రేజ్‌ను కొనసాగిస్తూ సిర్పూరులో మరింత పట్టు సాధించి బీజేపీకి మెజార్టీ ఓటు బ్యాంకు పెంచేలా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. సిర్పూరు నియోజకవర్గం బీజేపీకి పట్టు ఉన్న ప్రాంతాలతోపాటు గ్రామీణ ఓటర్లను కూడా ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటు ఆసిఫాబాద్ నియోజకర్గంలోను కొత్నాక విజయ్‌కి పగ్గాలు అప్పగించటం ద్వారా ఆ నియోజకవర్గంలోని ప్రధాన ఓటు బ్యాంకు అయిన ఆదివాసీల ఓట్లను బీజేపీ వైపు మళ్లించేందుకు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల తలరాతను మార్చగల సామర్థ్యం కలిగిన బీసీ సామాజిక వర్గాల్లో కీలకమైన ఆరె, బారె, మున్నూరు కాపుల ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు ఎత్తుకు పైఎత్తులతో వ్యూహాత్మకంగా ప్రచారానికి పదును పెడుతున్నాయి. మరోవైపు ఎస్సీ(మాదిగ) సామాజిక వర్గం ఓటర్లను ఆకట్టుకునేందుకు మూడు పార్టీలు ప్రయత్నిస్తున్నప్పటికీ ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ప్రకటించిన దరిమిలా ఆ సామాజికవర్గ ఓటర్లు ఎవరి వైపు నిలబడుతారన్నది జిల్లాలో ఆసక్తిగా మారింది.



బాల్య వివాహాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



పాల్గొన్న కూలీలు, మహిళా సాధికారత కేంద్రం సభ్యులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని చిలాటిగూడ గ్రామంలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలకు బాల్య వివాహాలు, ఆర్థికఅక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల పట్ల అందరికీ అవగాహన ఉండాలన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరగితే 1098నెంబర్‌కి ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. గృహ హింసకు గురైతే 181కి ఫోన్ చేయాలన్నారు. 10సంవత్సరాల లోపు ఆడపిల్లల భవిష్యత్తు కోసం సుకన్య సమృద్ధి యోజన స్కీం చాలా ఉపయోగపడు తుందన్నారు. అదేవిధంగా సురక్ష భీమాయోజన, జీవనజ్యోతి భీమాయోజన అటల్ పెన్షన్ యోజన అందరు కట్టుకోవాలని చెప్పారు. అలాగే వడదెబ్బ తగిలితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారకేంద్రం సిబ్బంది జెండర్ స్పెషలిస్టు రాణి, రాజేశ్వరి, సాగర్, సుమలత, సంక్షేమా ధికారి మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

కెరమెరి, ఏప్రిల్ 26: మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 28న నిర్వహించే ఎంపీ ఎన్నికల ప్రచారం బహిరంగసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ బహిరంగసభకు పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్కతోపాటు పార్టీఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ఎంపీ అభ్యర్థి సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు హాజరు కానున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం

వాంకిడి, ఏప్రిల్ 26: మండలంలోని కోటిగూడలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణ, యూత్‌అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలను వివరించి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

ఆత్రం సక్కు గెలుపునకు సమష్టి కృషి చేయాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లింగాపూర్, ఏప్రిల్ 26: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు కార్యకర్తలు సమష్టి కృషిచేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గడిచిన పేదళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామీణులకు వివరించి బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్, సీనీయర్‌నాయకులు యునుస్ అక్బాని, కెరమెరి వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్, కెరమెరి, నార్నూర్, గాడిగూడ తదితర మండలాల కార్యకర్తలు, పార్టీఅధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం

- గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

బెజ్జూరు, ఏప్రిల్ 26: ఒకరేమో బంధువుల ఇంట్లో కేశఖండనం ఉందని...మరొకరేమో పెళ్లి రిసెప్షన్ కోసం సంతోషంగా బయలుదేరారు. ఇంతలోనే ఊహించని రీతిలో విధి వెక్కిరించి రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో ముగ్గురి ప్రాణాలు బలిగొన్నాయి. దీంతో మూడు కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే బెజ్జూరు మండలంలోని కోర్తేగూడ-పోతేపల్లి గ్రామాల మధ్య గురువారం అర్ధరాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడి కక్కడే మృత్యువాత పడగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్కపల్లి గ్రామానికి చెందిన దున్న నరసింహతో పాటు శనిగరం రాజ్‌కుమార్, ఆయిల్ల నిఖిల్ ఒక బైక్‌పై పోతేపల్లిలో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లి రిసెప్షన్ కోసం వెళ్తున్నారు. బారేగూడ గ్రామానికి చెందిన తొర్రెం వెంగళ రావు, అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ మరో బైక్‌పై బూరుగుగూడలో కేశఖండనానికి వస్తున్నారు. వీరు వస్తున్న రెండు బైక్‌లు కోర్తెగూడ సమీపంలో అతివేగంతో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో నరసింహ(20), మహేష్(26), వెంగళరావు(30) అక్కడిక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో నిఖిల్, రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై విక్రమ్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ క్షత గాత్రులను వైద్యం కోసం కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇందులో నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండ టంతో మంచి ర్యాలకు తరలించారు.



దున్న నరసింహ(ఫైల్)

అతివేగమే ప్రమాదానికి కారణమా?

అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాద దృశ్యాన్ని చూస్తే అతివేగమే కారణమని తెలుస్తోంది. అతివేగంతో పాటు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ముగ్గురి ప్రాణాలు బలైపోయాయి. వారు వస్తున్న వేగానికి బైక్‌లపై ప్రయాణి స్తున్న వారంతా తలా ఒకచోట ఎగిరిపడ్డారు. కుకుడ- బారేగూడ గ్రామాల మధ్య గతేడాదే డబుల్ రోడ్డు పనులు పూర్తిచేశారు. రోడ్డు బాగుండటంతో ఈ మార్గం గుండా వాహనదారులు ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తున్నారు. రోడ్డుపై ఎక్కడా కూడా ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు లేనికారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

శోకసంద్రంలో కుటుంబాలు..

మండలంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా వారికుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. ఇంటిపెద్దలు మృతిచెందగా వారి కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించాయి. అందివచ్చిన కొడుకు ఒకరైతే మరో ఇద్దరు ఇంటిపెద్దలు కావడంతో వారు రోదిస్తున్న తీరు వర్ణనాతీతం. ఆత్రం మహేష్‌కు భార్య సరితతోపాటు ఒకకుమారుడు ఉన్నాడు. వెంగళరావుకు భార్య అనితతోపాటు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారి పిల్లలు తమ తండ్రి ఎక్కడ ఉన్నాడంటూ రోదిస్తుండగా పలువురి కళ్లల్లో నీళ్ల తిరిగాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



ఆసుపత్రిని సందర్శిస్తున్న రాష్ట్ర బృందం

పెంచికలపేట, ఏప్రిల్ 26: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు వెంకటేశ్వరచారి, శ్యాంలాల్ శుక్రవారం సందర్శించారు. కుష్టు వ్యాధి రోగులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. వ్యాధికి సంబంధించిన లక్ష ణాలు, దాని నిర్మూలనకు ఎలాంటి చికిత్స అందించాలన్న విషయాలపై ఆరోగ్యకేంద్రం సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధి గ్రస్తుల పట్ల ఎటువంటి వివక్ష చూపకుండా పని చేయా లని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆశ్విన్, ఫార్మసిస్టు ఎస్‌ఎస్‌ఎస్ రెడ్డి, సూపర్‌వైజర్ విక్టోరియా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

సిరప్పూర్(టి), నవంబరు 26: ఈ నెల 27న కాగజ్‌నగర్ పట్ట ణంలోని పటేల్ గార్డెన్స్‌లో జరిగే బీసీ సామాజిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. ఈ సమావేశానికి తెలం గాణ రాష్ట్ర ఓబీసీ ఇన్‌చార్జి రాధేశ్యామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్‌గ నాటె, ఎమ్మెల్యే హరీష్‌బాబు రానున్నట్లు తెలిపారు. సమావేశంలో పెద్దసంఖ్యలో బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నారాయణ, శ్రీనివాస్‌చారి, సురేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యమే సంస్థ ధ్యేయం

- ఆర్టీసీ ఆర్‌ఎం సోలేమాన్



కార్మికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆసిఫాబాద్, ఏప్రిల్ 26: కార్మికుల ఆరోగ్యమే ఆర్టీసీ సంస్థ ధ్యేయమని ఆర్టీసీ ఆర్‌ఎంపీ సోలేమాన్ అన్నారు. శుక్రవారం డిపోలో ఏర్పాటు ఏసిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0ను ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యమే మహ భాగ్యం అని, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యం పట్ల సంస్థ ప్రత్యేక దృష్టిసారించి గ్రాండ్‌హెల్త్ క్యాంపు నిర్వహిస్తోందన్నారు. డిపోలో పనిచేస్తున్న 331మంది ఉద్యోగులతోపాటు 57మంది అద్దెబస్సుల డ్రైవర్లకు ఆరోగ్యపరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపు ఈనెల 30వరకు కొనసాగుతుందని కార్మికులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం విశ్వనాత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉదయ్ తదితరుల పాల్గొన్నారు.

బారెగూడలో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతైన మందాడి రాజయ్య ఇల్లు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 26: కాగజ్‌నగర్ మండలం బారెగూడలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుందని రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. బారెగూడలో నివాసం ఉంటున్న మందాడి రాజయ్య ఇంట్లో ఉన్న సిలిండర్ గ్యాస్ లీకేజీ అయి ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. కాలనీ వాసుల వెంటనే స్పందించి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అనంతరం అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేసినట్టు వివరించారు. కాగా ఈ సంఘటనలో రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్టు ఆమె తెలిపారు. రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

జిల్లాలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 26: జిల్లాలో శుక్రవారం 43.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. పెంచికలపేట మండలంలో 43.5డిగ్రీలు నమోదు కాగా ఆసిఫాబాద్‌లో 43.4 డిగ్రీలు, దహెగాంలో 43.1డిగ్రీలు, బెజ్జూరులో 43.0డిగ్రీలు, రెబ్బెన, కాగజ్‌నగర్‌లలో 42.4 డిగ్రీలు, కౌటాల, సిర్పూర్(టి)లలో 42.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.



వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జీ జీఎం సత్యనారాయణ

రెబ్బెన, ఏప్రిల్ 26: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గోలేటి శ్రీభీమన్న మైదానంలో వేసవిక్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే20వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. ఈశిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్ తిరుపతి, డీజీఎం(సీహెచ్‌పీ) భీంరావు జాడే, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీవిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26: గోదావరిఖనిలో ఈ నెల 28న నిర్వహించే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కోరారు. శుక్రవారం వివిధ గనులపై గేట్‌మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. నూతన అండర్‌గ్రౌండ్ గనుల ఏర్పాటు, సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను మినహాయింపు, తదితర హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, ముందుండి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్మికులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఆయా సమావేశాల్లో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, పిట్ కార్యదర్శులు మురళీచౌదరి, బీర రవీందర్, గునిగంటి నర్సింగారావు, దాడి రాజయ్య, సంఘం సదానందం, మోతె లచ్చయ్య, ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి: సేఫ్టీ జీఎం



కాసిపేట గనిపై మాట్లాడుతున్న సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్

కాసిపేట, ఏప్రిల్ 26: కార్మికులందరూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీజీఎం రఘుకుమార్ అన్నారు. శుక్రవారం కాసిపేటగనిపై నిర్వహించిన రక్షణఅవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒకకార్మికుడిపై అతని కుటుంబం ఆధారపడి ఉందన్న విషయాన్ని మరువకూడదన్నారు. కార్మికులు బాగుంటేనే సంస్థ బాగుంటుందన్నారు. అనంతరం మొదటిసారిగా గనికివచ్చిన సేఫ్టీ జీఎంను కార్మిక సంఘాల నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు విజయ్‌కుమార్, గనిమేనేజర్‌భూశంకరయ్య, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.





కూలీలందరికీ పనులు కల్పించాలి: డీఆర్డీవో

వేమనపల్లి, ఏప్రిల్ 26: గ్రామాల్లోని కూలీలందరికి ఉపాధిహామీ పనులను కల్పించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం అడిషనల్ డీఆర్‌డీవో దత్తరావుతో కలిసి గొర్లపల్లి గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. మస్టర్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలందరికి గరిష్టవేతనం రూ.300పొందేలా కొలత ప్రకారం పనులను చేయించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న పని ప్రదేశాల్లో నీడసౌకర్యం కల్పించాలని, మెడికల్‌కిట్‌లు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఉదయం 10గంటలలోగా పనులను పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిసిబ్బందితో సమావేశం నిర్వహించారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవోసత్య ప్రసాద్, ఏపీఎంఉమారాణి, సురేష్,ఏఈ రాజేశ్వర్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

మే 6 నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 : కాకతీయ యూనివర్సిటీ బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలు మే 6వ తేదీ నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు.

- బీఏ, బీఏ(లాంగ్వేజెస్) బీకాం, బీఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 6, 8, 10, 16, 18, 21, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు.

- బీఏ, బీఏ (లాంగ్వేజెస్) బీకాం, బీఎస్సీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 7, 9, 15, 20, 22, 25, 28, తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

- బీఏ, బీఏ (లాంగ్వేజెస్) బీకాం, బీఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 6, 8, 10, 16, 18, 21, 24, 27, 29, 31, జూన్ 1, 7, 11 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

- కేయూ పీడీసీ మొదటి, రెండో ఏడాది తెలుగు పరీక్షలు మే 8 నుంచి జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే రెండో ఏడాది పరీక్షలు మే 15వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని వారు వెల్లడించారు.














పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

బెల్లంపల్లి, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం పోచమ్మ గడ్డ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజు ఎన్ని వాహనాలను తనిఖీలు చేస్తున్నారో తెలుసుకుని రిజిష్టర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్‌ఐలు ఉన్నారు.

దండేపల్లి: ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఎస్సై భూమేష్ అన్నారు. జిల్లా సరిహద్దు గూడెం, తాళ్లపేట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డబ్బు, మద్యం సరఫరా కాకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి వివరాలను సేకరించాలన్నారు ఎస్ఎస్‌టీ టిమ్ సభ్యులు, పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కాసిపేట, ఏప్రిల్ 26 : మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సెల్‌ఫోన్‌ను అందజేశారు. తాండూర్ మండలం తంగళ్లపల్లికి చెందిన రాదండి రమేష్ ఈ నెల 5న సోమగూడెంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మొబైల్ ట్రాక్ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి శుక్రవారం రమేష్‌కు అందజేసినట్లు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నెన్నెల, ఏప్రిల్ 26: మండలంలోని చిన్న, పెద్ద లంబాడితండాల్లోని గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సోదాలు చేశారు. తోటలు, పెరళ్లలో దాచిపెట్టిన డ్రమ్ములను గుర్తించి 1900 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసి బట్టీలను ధ్వంసం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. చెన్నూరు, మంచిర్యాల ఎక్సైజ్ సీఐలు హరీ, సమ్మయ్య, ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగిరెడ్డి, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు, దరఖాస్తులపై తక్షణమే స్పందించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 26 : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జిల్లాలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, దరఖాస్తులపై తక్షణమే స్పందించాలని ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సమీర్ నైరంతర్య అన్నారు. శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్‌రాహుల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, సి విజిల్, వీడియో పరిశీలన, వెబ్ కాస్టింగ్, మీడియా సెంటర్‌లను తనిఖీ చేశారు.



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల ఖర్చుల పరిశీలకులు

రికార్డులను, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని, జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రకటనల దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతులు ఇవ్వాలన్నారు. సహాయ కార్మిక శాఖ కమిషనర్ వినీత, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

తాండూర్, ఏప్రిల్ 26: కాకా వెంకటస్వామి స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ అన్నారు. శుక్రవారం బోయపల్లి, తాండూర్, అచ్చలాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి పర్యటించారు. గడ్డం వంశీ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఐదు గ్యారంటీలను అమలు చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గడ్డం వంశీని గెలిపించాలన్నారు. ఐబీ నుంచి కిష్టంపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నాయకులు వేణుగోపాలచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, నాయకులు సిరంగి శంకర్, గట్టు మురళీధర్‌రావు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ

బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవద్దు

తాండూర్ పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్‌రావుతోపాటు అతని అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గడ్డం వినోద్‌ను కలిశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నాయకులను ఇబ్బందులకు గురి చేశారని, వారిని పార్టీలో చేర్చుకోవద్దని నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాన్ని అడ్డుకుని కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకోవాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వినోద్ కలుగజేసుకుని టీపీసీసీకి, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు చేరికపై నిర్ణయం తీసుకుంటామని వెళ్లిపోయారు.

ఆదరించండి...అండగా ఉంటా

కాసిపేట: తనను ఆదరించి గెలిపిస్తే ప్రజలందరికి అండగా ఉంటానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ పేర్కొన్నారు. కాసిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం ఓరియంట్ సిమెంట్ కంపెనీ గేటు ఎదుట ఆయన మాట్లాడారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీలో అర్హులైన స్థానికులకు ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కృషి చేస్తుందన్నారు. అనంతరం కొండాపూర్ యాప వద్ద రోడ్డుషో నిర్వహించారు. చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వివేక్, గడ్డం వినోద్ వెంకటస్వామి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, వంశీకృష్ణరావు, మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోశారు...



కాసిపేట, ఏప్రిల్ 26: సోమగూడెం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి కళ్యాణ చక్రవర్తి స్పృహ కోల్పోయాడు. బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ రామకృష్ణ సీపీఆర్ చేసే ప్రయత్నం చేశాడు. అటువైపుగా వచ్చిన 108 అంబులెన్స్ ఈఎంటీ దుర్గం ఆత్మారాం విధుల్లో లేకున్నప్పటికీ సీపీఆర్ చేసి ప్రాణం పోశాడు. పాత బెల్లంపల్లికి చెందిన కళ్యాణ చక్రవర్తి కాసిపేట నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో మంచిర్యాల నుంచి వేగంగా వచ్చిన కారు బైక్ వెనుక ఢీకొట్టింది. ఈ ఘటనలో చక్రవర్తి కాలు విరిగింది. సీపీఆర్ చేసిన కానిస్టేబుల్, ఈఎంటీలను పలువురు అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు



భీమారం, ఏప్రిల్ 26: మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో 9 ఐకేపీ సెంటర్లు, నాలుగు డీసీఎంఎస్ సెంటర్లు, నాలుగు పీఏసీఎస్ సెంటర్‌లను ప్రారంభించాల్సి ఉండగా ఐకేపీ ఆధ్వర్యంలో 9 సెంటర్లను ఏర్పాటుచేశారు. పీఏసీఎస్ సెంటర్‌లను మద్దికల్, కొత్తపల్లి, ఆరేపల్లి, భీమారం గ్రామాల్లో ప్రారంభించారు. ధర్మారం, బూరుగుపల్లి, పోతనపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీంతో రైతులు ధాన్యం కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు పేర్కొంటున్నారు.

బీజేపీలో చేరికలు



కిషన్ రెడ్డితో నాయకులు

చెన్నూరు, ఏప్రిల్ 26: చెన్నూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బత్తుల సమ్మయ్య, కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, జాడి సురేఖ, శాంత, నాయకులు జాడి తిరుపతి, వెంకటనర్సయ్యలు శుక్రవారం బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు రమేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల అంబేద్కర్ సంఘం నాయకులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రామగిరి శ్రీపతి, రాజ్‌కుమార్, రాజశేఖర్, ప్రశాంత్‌రెడ్డి, కుమార్‌లు జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ సమక్షంలో చేరగా కేంద్ర మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు.

అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్



కాసిపేట మండలంలో పర్యటిస్తున్న కొప్పుల ఈశ్వర్

కాసిపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలో ప్రచారం చేశారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ వద్ద గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దేవాపూర్ కంపెనీలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేలా పోరాడుతామన్నారు. రైతు సంక్షేమానికి పాటుపడని కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. కాకా కుటుంబం ఆస్తులను కాపాడుకోవడానికి రాజకీయాల్లోకి వచ్చిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జెడ్పీటీసీ చంద్రయ్య, ఎంపీటీసీ రాంచందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కంపెనీ వర్కింగ్ ప్రెసిడెం ట్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రజలకు ఇచ్చిన హామీలను నెర్వేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ధర్మారావుపేట, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్, గుడిరేవు గ్రామాలలో ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ధర్మారావుపేటలో ఉపాధి కూలీల వద్ద వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. శ్రీనివాస్, అనిల్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

14మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు తిరస్కరణ

- పెద్దపల్లి పార్లమెంటు రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్లలో 14మంది అభ్యర్థుల 24 నామినేషన్ పత్రాలను తిరస్కరించారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నామినేషన్లు దాఖలు చేసిన వారి సమక్షంలో పత్రాలను పరిశీలించారు. ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా 63మంది అభ్యర్థులు 109సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. వాటిని నామినేషన్లు సమర్పించిన అభ్యర్థుల సమక్షంలో పరిశీలించారు. 63మంది అభ్యర్థులు 109నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఇందులో 14మంది అభ్యర్థులకు సంబంధించిన 24 నామినేషన్ పత్రాలు నిబంధనల ప్రకారం లేనందున వాటిని ఎన్నికల అధికారి తిరస్కరించారు. భారతఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అన్ని వివరాలు పూర్తిగా సమర్పించిన 49మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఆమోదించామని పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ ప్రకటించారు.



నామినేషన్‌పత్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

ప్రధానపార్టీలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్లు నిబంధనల ప్రకారం సక్రమంగా ఉన్నందున ఆమోదించారు.

మొరాయించిన వేంపల్లి రైల్వే గేటు

- ఎర్రటి ఎండలో రెండు గంటలు అవస్థలు పడిన ప్రయాణికులు



వేసి ఉన్న రైల్వే గేటు

సిర్పూర్(టి), ఏప్రిల్ 26: సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వేంపల్లి సమీపంలో ఉన్న రైల్వే గేటు శుక్రవారం మొరాయించింది. దీంతో రెండు గంటల పాటు వాహనదారులు, ప్రజలు ఎర్రటిఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. నీడకోసం షెడ్డు లాంటివి లేకపోవడంతో చెట్ల కిందికి పరుగులు తీశారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయింది. రైల్వే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. అయితే రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న ఓఆర్‌బీ పనులు పూర్తైతే కానీ తమకష్టాలు తీరేలా లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు.



ఎండలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఎండిపోయిన పాల్వాయి ప్రాజెక్టు

- నీరందక ఎండిన వరిపంట
- దిక్కుతోచని స్థితిలో రైతులు



చుక్క నీరు లేక ఎడారిగా మారిన పాల్వాయి ప్రాజెక్టు



ఎండి పోతున్న వరి పంట

దహెగాం, ఏప్రిల్ 26: దహెగాం మండలంలోని కల్వాడ గ్రామ సమీపంలోని పాల్వాయిపురుషోత్తమరావు ప్రాజెక్టు ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు కింద వేసిన వరి పంట నీరు లేక ఎండిపోతోంది. సాగునీటి విడుదల చేసే తీరు లేకపోవడంతోనే తమ వరి పొలాలు ఎండిపోతున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

3100ఎకరాల్లో వరిపంట సాగు..

కల్వాడ, కుంచవెల్లి, చంద్రపల్లి, పీకలగుండం, భామానగర్ తదితర గ్రామాల్లోని రైతులకు పాల్వాయి ప్రాజెక్టు నీరే ఆధారం. ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద వానాకాలం రైతులు 3100ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. పంట వేసే క్రమంలో ప్రాజెక్టులో పుష్కలంగా నీరుంది. దీంతో రైతులు వరి వేస్తే బాగుంటుందని భావించి వేశారు. కానీ నీటి విడుదల సక్రమంగా లేకపోవడంతో ప్రాజెక్టు తొందర్లోనే ఎండిపోయింది. దీంతో నీరంది పంటలు బాగా పండుతాయి అని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో చివరి పంట పొలాలకు సాగు నీరంద లేదు. పంటలకు నీరందక పదుల ఎకరాల్లో పొలాలన్నీ బీడుబారాయి. సాగునీటి విడుదల తీరు సక్రమంగా లేక పోవడంతోనే వరిపొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

వరిపంట ఎండిపోయింది..
- తాళ్ల దామాజీ, రైతు, పీకలగుండం



రెండు ఎకరాల్లో వేసిన వరిపంట ఎండి పోయింది. పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

పశువులకు వదిలేశాను..
- దుర్గం వెంకటి, పీకలగుండం



వానా కాలంలో సాగు చేసిన వరి పొలం ఎండి పోయింది. ప్రాజెక్టు కూడా ఎండిపోయింది. దిక్కులేని పరిస్థితుల్లో ఎండిన వరిపొలాన్ని పశువులకు వదిలివేశాను.

ఆర్జేసీ, ఆర్డీసీ ప్రవేశపరీక్షకు సర్వం సిద్ధం

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 26: మహాత్మాజ్యోతి బాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి (బీసీ, ఎస్సీ, ఎస్టీగురుకులాలు) నిర్వహిస్తున్న ప్రవేశపరీక్ష ఆర్జేసీ, ఆర్డీసీ సెట్-2024 కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కన్వీనర్ వెంకట ప్రసాద్ తెలిపారు. ఈనెల 28న ఆదివారం ఉదయం10నుంచి 12గంటల వరకు జరిగే పరీక్షకు అందరూ సకాలంలో హాజరు కావాలన్నారు.

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటముందే చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించడం కుదరదని అన్నారు.


ఆర్థిక ఇబ్బందులతో కార్మికుడు ఆత్మహత్య



మృతిచెందిన మహేశ్వర్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 26 : పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన మేడ మహేశ్వర్ (55) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి చూడగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడు ఏరియాలోని కేకే5 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని నెలలుగా విధులకు వెళ్లడం లేదు. మద్యానికి బానిస కాగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
శనివారం 27 ఏప్రిల్ 2024



జోరుగా నకిలీ విత్తనాల దందా



- ఎల్లలు దాటుతున్న నిషేధిత బీటీ-3 విత్తనాలు
- సీజన్‌లో నిఘా ఉంటుందని ముందే విక్రయాలు
- పక్క రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతులు
- మంచిర్యాల కేంద్రంగా కొనసాగుతున్న వ్యాపారం

మంచిర్యాల/బెల్లంపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పత్తి సీజన్ ప్రారంభానికి ముందే నకిలీ పత్తి విత్తనాలను (నిషేధిత బీటీ3) అమ్మేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. జిల్లాలో కొందరు వ్యాపారులు పక్క రాష్ట్రాల నుంచి వాహనాల ద్వారా నకిలీ పత్తి విత్తనాలను దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని ఎవరికి అనుమానం రాకుండా మామిడితోటల్లో, ఇండ్లలో, రహస్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. పత్తి సీజన్‌లో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల నిఘా ఉంటుందని ముందుగానే తరలించి రైతులకు విక్రయిస్తున్నారు. యేటా నకిలీ పత్తి విత్తనాలు అమ్మే వ్యాపా రులపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తున్నా నకిలీ పత్తి విక్రయాల దందా ఆగడం లేదు. గుంటూరు ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు వ్యవసాయం నిమిత్తం మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఉంటూ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, నంద్యాలతోపాటు గుజరాత్ నుంచి నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తూ ఇక్కడి రైతులకు విక్రయిస్తున్నారు.

సీజన్‌కు ముందే జోరుగా దందా

జిల్లాలో పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత ఏడాది సీజన్‌లో లక్షా 90 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వర్షాకాలం (జూన్, జులై నెలల్లో)లో పత్తి పంట వేయడానికి రైతులు సిద్ధమవుతారు. సాగు చేసే సమయంలో వ్యవసాయ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఉంటుంది. అలాగే ఎప్పటికప్పుడు వాహనాలను, ఎరువులు, విత్తనాలు విక్రయించే షాపులను తనిఖీ చేస్తుంటారు. ఆ సమయంలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మాలంటే అక్రమార్కులకు కష్టంగా ఉంటుంది. దీంతో మూడు నెలల ముందే నకిలీ విత్త విత్తనాల దందాకు అక్రమార్కులు తెర లేపారు.

ఇతర రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతి

జిల్లాలో నిషేధిత పత్తి విత్తనాలు విక్రయించే వారు వివిధ రాష్ట్రాల నుంచి జిల్లాలోని ప్రాంతాలకు తరలిస్తున్నారు. గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వాహనాల్లో జిల్లాకు తీసుకువస్తున్నారు. ఈ విత్తనాలను ఆయా గ్రామాల్లోని స్థానిక వ్యాపారులతో కలిసి రైతులకు అంటగడుతున్నారు. కిలో విత్తనాలను రూ.2 వేల నుంచి 2500ల వరకు విక్రయిస్తున్నారు. రైతులు సైతం బీటీ3 విత్తనాలపై ఆసక్తి చూపుతుండడంతో అక్రమ వ్యాపారులకు వరంగా మారుతోంది.

ఈ ప్రాంతాల్లోనే అధిక విక్రయాలు

జిల్లాలోని బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, నెన్నెల, చెన్నూరు నియోజకవర్గంలోని మందమర్రి, భీమారం, చెన్నూరులతోపాటు మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లో ఎక్కువ శాతం నకిలీ పత్తి విత్తనాలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. యేటా ఈ ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు విక్రయించే అక్రమార్కులపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తున్నా మార్పు రావడం లేదు. ఈ ప్రాంతాల్లో సీజన్‌కు ముందే ఇప్పటికే పలువురు వ్యాపారులు బీటీ 3 విత్తనాలను దిగుమతి చేసుకుని కోట్ల రూపాయల విలువ చేసే విత్తనాలను నిల్వ ఉంచినట్లు సమాచారం.

ఇటీవల పట్టుబడిన విత్తనాలు

ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 పత్తి విత్తనాల సరఫరా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 22న కర్ణాటకలోని కొప్పల్ జిల్లా నుంచి మందమర్రికి తరలిస్తుండగా మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌లో ఉల్లిగడ్డ బస్తాల మాటున నకిలీ విత్తనాలను తరలిస్తూ పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి రూ. 35 లక్షల విలువైన 1.2 టన్నుల బీటీ-3 పత్తి విత్తనాలతోపాటు ఉల్లిగడ్డ బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మందమర్రికి చెందిన శివయ్య, పిండి సురేష్ రాష్ట్రానికి తీసుకొచ్చి వివిధ ప్రాంతాల్లో రైతులకు అమ్ముతుంటారు.

కర్ణాటక నుంచి రాష్ట్రానికి తీసు కొచ్చేందుకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గోషిక నవీన్ కుమార్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గడ్డం శ్రీకాంత్‌ల సహాయం తీసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆ ఇద్దరు డ్రైవర్లు కావడంతో ట్రిప్పు ఒక్కంటికి 5వేల రూపాయల చొప్పున కమీషన్ ఇచ్చి కర్ణాటక నుంచి తీసుకొచ్చేలా ఒప్పందం కుదుర్చు కున్నారు. నిషేధిత విత్తనాలు తరలిస్తుండగా సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదకరమైన గ్లైఫోసేట్ గడ్డి మందును తట్టుకునే శక్తి బీటీ-3 విత్తనాలకు ఉండడంతో ప్రభుత్వం నిషేధించింది. అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా బీటీ-3 విత్తనాలు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.కన్నెపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో గురువారం నాలుగు కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.

నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాం

రామగుండం సీపీ శ్రీనివాస్



నకిలీ పత్తి విత్తనాలపై నిఘా పెట్టాం. నకిలీ విత్తనాలు అమ్ముతు రైతులను మోసం చేసే వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రభుత్వం నిషేధించిన పత్తి విత్తనాలను ఎవరైనా అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు పీడీయాక్టు నమోదు చేస్తాం.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఏసీసీ, ఏప్రిల్ 26: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని రామగుండం సీపీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, కమిషనరేట్ పరిధిలో గంజాయి, రేషన్‌బియ్యం, ఇసుక అక్రమ రవాణా, నకిలీ పత్తి విత్తనాల విక్రయం, పేకాట, కోడి పందేలు, గుడుంబా తయారీ, అక్రమ రవాణా, అనుమతి లేని చిట్‌ఫండ్‌లు, భూకబ్జాలకు పాల్పడే వారిపై పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమతి లేని లే అవుట్ వెంచర్ల ఏర్పాటు ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి పూర్తిస్థాయిలో రూపుమాపుతామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమన్నారు. పీడీ యాక్టు అమలుకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి జాబితా సిద్ధం చేశామన్నారు.

రేపు కబడ్డీ ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26: శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అర్గనైజింగ్ కార్యదర్శి రాజేంద్రపాణి, జాయింట్ సెక్రటరీ బండి తిరుపతి, ట్రెజరర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని, అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు పీఈటీ సదానందంను సంప్రదించి రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, 9849124856 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లు అడిగే హక్కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శనివారం మంచిర్యాల, నస్పూర్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభకు కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు హాజరవుతారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చడానికి కృత నిశ్చయంతో ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పెంపు, రైతు భరోసా అమలు చేశామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించి రోజు గంటసేపు అందిస్తున్నామన్నారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో వరదలు వచ్చి ఇండ్లు మునిగితే బీఆర్ఎస్ నాయకులు ఇండ్లలో పడుకున్నారని, కాంగ్రెస్ నాయకులు ప్రజలకు సహాయం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల జిల్లాకు ప్రయోజనం శూన్యమన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు తరుగు పేరిట చేస్తున్న దోపిడిని అరికట్టామన్నారు. ఆగస్టులో వానలు పడక కేసీఆర్ పాలనలోనే కరువు వస్తే డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎలా కారణం అవుతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 2014, 2018లో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. పట్టాదారు కాస్తుదారుల వివరాలను మళ్లీ రికార్డు చేస్తున్నామని, ఇది పూర్తి కాగానే కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామన్నారు. బీజేపీ రాముని జపం చేయడం తప్ప మరేమి లేదన్నారు. ప్రధాని మోదీ యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించి 10 ఏండ్లలో 7 కోట్ల ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతున్నారన్నారు. బీజేపీ పెట్టుబడిదారి విధానాన్ని ప్రోత్సహించే పార్టీ అని, అన్ని వర్గాలను కాపాడేది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం హడ్కో రుణం 42 వేల కోట్లు మంజూరైందని, ఎన్నికల కోడ్ అయి పోగానే పనులను ప్రారంభిస్తామన్నారు. సింగరేణి నిధులు స్థానికంగానే ఉపయోగించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్‌లు ఇచ్చి కావాలని కోర్టు కేసులు వేయించి ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు. శనివారం నిర్వహిం చే కాంగ్రెస్ ఆశీర్వాద సభలో ప్రజ లు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. నస్పూర్ మాజీ సర్పంచు గోపన్న, తదితరులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, చిట్ల సత్యనారాయణ, సుర్మిళ్ల వేణు, సల్ల మహేష్, సుధాకర్, చంద్రశేఖర్, శ్రీనివాసరామ్, రవికుమార్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రం, నస్పూర్‌లో శనివారం నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు శుక్రవారం పరిశీలించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్ బాల్ ఛాంపియన్‌గా నిలిచిన మహిళల కరీంనగర్ జట్టు

నస్పూర్, ఏప్రిల్ 26: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పురుషుల, మహిళల ప్రీమియర్ లీగ్ పోటీలు శుక్రవారం ముగిసాయి. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫస్ట్ తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్ ఛాంపియన్స్ పురుషుల విభాగంలో వరంగల్, మహిళ విభాగంలో కరీంనగర్ జట్టు ఛాంపియన్స్‌గా నిలిచాయి. పోటీల్లో పురుషుల జట్లలో వరంగల్ (ప్రథమ), హైదరాబాద్ (ద్వితీయ), ఆదిలాబాద్ (తృతీయ), మహిళల జట్లలో కరీంనగర్ (ప్రథమ), హైదరాబాద్ (ద్వితీయ), మహబూబ్‌నగర్ (తృతీయ) బహుమతులను కైవసం చేసుకున్నాయి. విజేత జట్లకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పెంచాల శ్రీధర్, న్యాయవాది దామోదర్ లాల్‌బంగ్, గూడెం ఆలయ డైరెక్టర్ భూపతి మధుకర్, సాధన గ్రూప్స్ సలహాదారుడు పెంచాల వేణులు విజేతలకు బహుమతులు అందజేశారు. టీం ఇండియా హ్యాండ్ బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్, కరీంనగర్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తుండ్ల శ్రీనివాస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ పెంచాల సంధ్యా, పీఈటీలు పున్నం శ్రీనివాస్, ప్రేమ్ సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి



తూకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మందమర్రిరూరల్, ఏప్రిల్ 26: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే రైసుమిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ సూచించారు. శుక్రవారం సారంగపల్లి, పొన్నారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తూకాన్ని, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం అందుగులపేటలోని అంబికాసోని రైసు మిల్లు వద్ద ఆయన మాట్లాడుతూ లారీల్లో వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలు

జన్నారం, ఏప్రిల్ 26: దేవునిగూడ గ్రామానికి చెందిన అల్లి నాగయ్య శుక్రవారం అడవి పంది దాడిలో గాయపడ్డాడు. నాగయ్య ఉదయం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా అడవి పంది దాడి చేయడంతో పక్కటెముకలు విరిగి పోయి తీవ్రంగా గాయపడ్డాడు. నాగయ్య అరుపులు విన్న స్థానికులు వచ్చి అడవి పందిని తరిమి వేసి నాగయ్యను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

లివర్ దానం చేసిన బెటాలియన్ ఆర్ఐ

హాజీపూర్, ఏప్రిల్ 26 : గుడిపేటలోని 13వ బెటాలియన్‌లో ఆర్ఐగా పనిచేస్తున్న గోపి అతని తల్లికి లివర్ దానం చేశాడు. గోపి తల్లి కళావతి లివర్ చెడిపోవడంతో మార్పిడి చేయాల్సి వచ్చింది. గోపి తన లివర్‌ను ఇచ్చి ప్రాణదానం చేశాడు. శుక్రవారం కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష గోపిని అభినందించారు. గోపి ఆరోగ్యం కోసం నెల రోజులు సెలవు మంజూరు చేసినట్లు కమాండెంట్ తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభం



ముల్కల్లలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

హాజీపూర్, ఏప్రిల్ 26: మండలంలోని ముల్కల్లలో శుక్రవారం ఓటరు స్లిప్పులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాములు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన వారందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓట్లు వేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హరిత, పంచాయతీ కార్యదర్శి సరిత, ఎన్నికల అధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని చెన్నూరు రిటర్నింగ్ అధికారి దారావత్ చంద్రకళ పేర్కొన్నారు. శుక్రవారం నర్వ గ్రామంలోని ప్రజలకు ఓటరు స్లిప్పులను తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి అందజేశారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజ లకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రా లను పరిశీలించి సౌకర్యాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు, గర్భిణీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ర్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ఐ తిరుపతి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల పరిధిలో 27,209 ఓటరు స్లిప్పుల పంపిణీని ప్రారంభించినట్లు డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పలు గ్రామాల్లో ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

దండేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పోల్ చిట్టీలను పంపిణీ చేయాలని తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్‌లు సూచించారు. తహసీల్దార్ కార్యలయంలో ఓటర్ స్లిప్పుల పంపిణీపై బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు పోల్ చిట్టీలను అందజేయాలన్నారు. ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటు వేయడానికి వెళ్లే సమయంలో ఓటరు స్లిప్‌ను వెంట తీసుకెళ్లాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఎంపీవో శ్రీనివాస్, సెక్టోరియల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దండేపల్లిలో బీఎల్‌వోలతో తహసీల్దార్ సమావేశం

ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఏసీసీ, ఏప్రిల్ 26: విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో సమ్మర్ సైన్స్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతిలోనే ఎన్నో ఆవిష్కరణలు ఉంటాయని, సమాజంలో ఎదుర్కొనే అనేక సమస్యలకు నూతన ఆవిష్కరణల ద్వారా పరిష్కారాలు చూపి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాక్షించారు. పుస్తకాల్లో నేర్చుకున్న సిద్ధాంత పరమైన విషయాలను, సైన్స్ సెంటర్‌లో నేర్చుకునే ప్రయోగాత్మక వివరాలను అన్వయించుకుని విషయ అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ హార్డ్‌వర్క్ చేయడం ఆదిమానవుని లక్షణమైతే స్మార్ట్‌వర్క్ చేయడం నాగరిక మానవుని ప్రగతికి చిహ్నమన్నారు. రీసోర్స్‌పర్సన్‌లు జాకీర్ హుస్సేన్, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు

చెన్నూరు, ఏప్రిల్ 26 : చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ నాగచందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 25 నుంచి మే 2 వరకు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు. ప్రత్యేక తరగతులను ఈ నెల 29 నుంచి నిర్వహిస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేడే పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 26 : బెల్లంపల్లిలోని సివిల్ కార్యాలయంలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ నాయకులు మేడే పోస్టర్లను విడుదల చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తొలగిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మనెంటు చేయాలని డిమాండ్ చేశారు. మేడే వేడుకల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మనోహర్, శ్యాం, కృష్ణవేణి, వెంకటి, వరుణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

ఏసీసీ, ఏప్రిల్ 26 : మంచిర్యాల మున్సిపాలిటీలో శనివారం ఉదయం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నుంచి మంచిర్యాలకు నీటి సరఫరా చేసే పైపులు వేంపల్లి వద్ద లీకవుతున్నందున మరమ్మతు చేపడుతున్నందున నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

సజావుగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏసీసీ, ఏప్రిల్ 26: ఓపెన్ స్కూల్ పరీక్షలు శుక్రవారం జిల్లాలో సజావుగా జరిగాయి. పదో తరగతిలో 639 మందికి 530 మంది హాజరయ్యారు. ఇంటర్‌లో 1141 మంది విద్యార్థులకు 976 మంది హాజయ్యారు. కలెక్టర్ బదావత్ సంతోష్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రాన్ని, డీఈవో యాదయ్య రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 26: ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.12 వేలు ఇవ్వాలని ఆటో జేఏసీ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం కల్పించడంతో ఆటోలకు గిరాకీలు లేక కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నెలకు రూ.12 వేలు అందించాలని కోరారు. నాయకులు విక్రమ్, మధుకర్, రాజు, వెంకటేష్, అంజయ్య, ఖలీం, శోభన్, మహేష్, సత్యం, రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ నియామకం



మంత్రి రామయ్య

కోటపల్లి, ఏప్రిల్ 26: బీజేపీ మండల కమిటీని శుక్రవారం నియమించి నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడిగా మంత్రి రామయ్య, ఉపాధ్యక్షులుగా మంచాల ప్రవీణ్‌కుమార్, వడ్లకొండ రాజేష్, ఇప్ప సంపత్, ప్రధాన కార్యద ర్శులుగా కందుల వెంకటేష్, కొండగొర్ల రాజేందర్, పెద్దింటి లచ్చన్న, కార్య దర్శులుగా ఉడత రాజబాబు, సుమన్, జయకర్, కోశాదికారిగా కాసెట్టి రాకేష్ నియమించారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా రాళ్లబండి శ్యాంసుందర్, మహిళ మార్చా అధ్యక్షురాలుగా చేకుర్తి సంగీత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, యువ మోర్చా అధ్యక్షుడిగా కొంకటి సుధాకర్, కొడిపె మహేష్, గట్టు శ్రీని వాస్‌గౌడ్, గారె రమేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా దుర్గం నర్సింహులు, కో కన్వీనర్‌గా గోదారి శ్రవణ్‌కుమార్‌లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

రక్తకణాలు దానం



మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 26: క్యాతనపల్లికి చెందిన కుమార్ అనే ట్రాక్టర్ డ్రైవర్ రక్తకణాలను దానం చేశారు. మంచిర్యాలకు చెందిన భీమ య్య అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా రక్తకణాలు తగిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. విషయాన్ని తెలుసుకున్న కుమార్ ఓ పాజి టివ్ రక్తకణాలను దానం చేశాడు. కుమార్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి అభినందించారు. సూపర్‌వైజర్‌లు మాధవి, విజ య్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.